సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

చిన్మయ మిషన్ రక్తదాన శిబిరం నేడు

ఉక్కునగరం: చిన్మయ మిషన్, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధి శివకుమార్ తెలిపారు. ఉక్కునగరం క్లబ్, విశాఖ బ్లడ్ సెంటర్ సహకారంతో ఉక్కునగరం క్లబ్ పార్టీ హాల్-3లో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నా రు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న శిబిరానికి వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



పశువైద్యశాల ఓఎస్‌డీ తాతారావును సత్కరిస్తున్న డాక్టర్ లావణ్య

అగనంపూడి: అంకిత భావంతో పనిచేసే ఉద్యోగికి ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని అగనంపూడి పశువైద్యశాల వైద్యురాలు డాక్టర్ గువ్వల లావణ్య అన్నారు. అగనంపూడి పశువైద్యశాల ఓఎస్‌డీ కోనేటి తాతారావు ఉద్యోగ విరమణ సందర్భంగా అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పని పట్ల చిత్తశుద్ధి, ఉద్యోగం పట్ల శ్రద్ధ ఉన్న ఉద్యోగిగా తాతారావుకు గుర్తింపు ఉందన్నారు. ఆయన శేషజీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తోకాడ రాము, బలిరెడ్డి సత్యనారాయణ, పట్టా పైడిరత్నం, నక్కా లక్ష్మి, దుర్గ, వరహాలమ్మ, గంగరాజు రామారావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటేష్ (ఫైల్)

అగనంపూడి: వ్యక్తి అదృశ్యంపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూర్మన్నపాలెం టీజీఆర్ నగర్‌కు చెందిన వల్లపు వెంకటేష్ (58) ఈ నెల 22వ తేదీన బయటికి వెళ్లి వస్తానని చెప్పి, ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో స్థానికంగా తెలిసిన వారిని వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో వెంకటేష్ కుటుంబ సభ్యులు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్ నగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తిప్పల నిలీష్ రెడ్డి, ప్రణీత తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా బాబాకు అర్చనలు, అభిషేకాలు, హోమాలు, సామూహిక పూజ, భస్మాభిషేకం అనంతరం అన్న సమారాధన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

తిరుపతికి కుర్తాళం పీఠాధిపతి పయనం



తిరుపతికి పయనమైన సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శుక్రవారంతో ముగియడంతో శనివారం ఉదయం కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని తిరుపతికి పయనమయ్యారు. అక్కడ నుంచి వారణాశికి తరలివెళ్లి సిద్ధేశ్వరి పీఠంలో కొద్ది రోజుల పాటు స్వామీజీ వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఆషాఢ మాసం సందర్భంగా జూలై 6 నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఆరోగ్యానికి వా'కింగ్'

వేకువజామున చల్లని గాలికి అలా వాకింగ్ చేసి వస్తే ఆ హాయే వేరు అంటారు ఆరోగ్యాభిలాషులు, ప్రకృతి ప్రేమికులు. పక్షుల కిలకిలరావాలను వింటూ, ఆహ్లాదకర వాతావరణంలో అలా వెళ్లి రావడం మనసుకు ఉల్లాసాన్ని, శరీరానికి చక్కని వ్యాయామాన్ని కూడా అందించడంతో యువత నుంచి వృద్ధుల వరకు నడక బాట పడుతున్నారు. ఉదయం వీలు కాని వాళ్లు, సాయంత్రం వేళల్లో సరదాగా పార్కు వరకు వెళ్లొస్తే అటు ఆరోగ్యం.. ఇటు ఆనందం అంటూ ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఏదేమైనా.. ఆరోగ్యానికి వా'కింగ్' బెస్ట్ అంటూ సర్టిఫై చేస్తూ ఉల్లాసంగా నడిచేస్తున్నారు.

- నడకపై ఆరోగ్యాభిలాషులకు పెరుగుతున్న శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో వాకర్ల సందడి



అయ్యన్నపాలెం పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్లు



పెదకోరాడ పార్కులో జాగింగ్ చేస్తున్న యువత

పెదగంట్యాడ: నడకతో ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకుంటున్నారు నగరవాసులు. మారుతున్న జీవనశైలి కారణంగా అనేక మంది ఊబకాయం, షుగర్, బీపీ తదితర దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్నారు. వీటన్నింటినీ ఎదుర్కొనేందుకు నడక చక్కటి ఆరోగ్య సూత్రమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కేవలం మందులతోనే సరిపెట్టుకోకుండా క్రమం తప్పకుండా వాకింగ్ అలవాటు చేసుకుంటే మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని సూచిస్తున్నారు. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ చకచకా నడిచేస్తున్నారు, ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

ఉదయం సాయంత్రం నడక

నడకపై ఏర్పడిన అవగాహనతో దినకరుడు రాక ముందే మండలంలో క్రీడా ప్రాంగణాలు, ఖాళీ మైదానాల్లోనూ ఉత్సాహంగా నడిచేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం నడక కారణంగా సూర్యరశ్మి శరీరాన్ని తాకి ఎముకల్లో కాల్షియం లోపాలను అధిగమించవచ్చని వైద్యులు చెబుతుండడంతో అధిక శాతం ఉదయాన్నే నడుస్తుండగా, కుదరని వారు సాయంత్రం నుంచి రాత్రి వరకూ వాకింగ్ చేస్తున్నారు. వాకింగ్ అనంతరం వ్యాయామాలు, యోగా చేస్తున్నారు.

వాకింగ్‌తో ఆరోగ్యంగా ఉన్నా



మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లతో వచ్చే అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు నడక ఉత్తమమని డాక్టర్లు చెప్పడంతో ఐదేళ్లుగా వాకింగ్ చేస్తున్నాను. నడక ప్రారంభించాక చాలా తేడా తెలిసింది. ప్రతీ పని ఉత్సాహంగా చేయగలుతున్నా. శరీరం చాలా తేలికగా ఉంటోంది. వాకింగ్ చేయడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను.

– కె.సర్వాదేముడు, వాకర్, సీతానగరం

నా జీవితంలో భాగమైంది



నిత్యం వాకింగ్ చేయడం వల్ల ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి అధికమవుతున్న నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలి. బీపీ సుగర్ వంటివి రావు, ఒకవేళ వచ్చినా నియంత్రణలో ఉంటాయి. ప్రతీ రోజూ వాకింగ్ చేస్తాను. ఎప్పుడైనా వాకింగ్ చేయని రోజు బద్దకంగా ఉంటుంది. అందుకే నడక నా జీవితంలో భాగమైంది.

– కులుకూరి శ్రీనివాసరావు, వాకర్, నడుపూరు

నడకతో ఎన్నో ప్రయోజనాలు



నడకతో ఒత్తిడి, ఆందోళన, కంగారు తదితర అనారోగ్య సమస్యలను అంశాలను అధిగమించవచ్చు. గుండె, ఊపిరితిత్తులకు రక్త ప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పని చేయడంతో గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం వంటివి దరి చేరవు. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను నియంత్రిస్తుంది. కీళ్లు కండరాలు సాగుతూ శక్తి పెరిగి నడిచేందుకు పూర్తి స్థాయిలో సమతుల్యత తీసుకువస్తుంది. రోజూ నడక ఆరోగ్యానికి ఎంతో మంచిది.

– డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా, వైద్యాధికారి, దేవాడ పీహెచ్‌సీ

బాలికల చదువు.. భవితకు వెలుగు



కళాజాత ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పెదగంట్యాడ: బాలికల చదువు వారి అభ్యున్నతితో పాటు దేశ భవితకు వెలుగు చూపిస్తుందని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. చదువుతోనే ఆత్మవిశ్వాసం వస్తుందని, బాలికలంతా బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సెక్టార్ పరిధిలోని నెల్లిముక్కు, బాలచెరువు, దయాల్‌నగర్–2 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మాతా శిశు సంక్షేమం, కిశోర బాలికలు, మహిళలు, బాలింతలు, గర్భిణుల కోసం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వేణుశ్రీ, విజయలక్ష్మి, వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, ఆయాలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి



ఎంపీ రమేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం భూములను త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్‌కు గాజువాక బీజేపీ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో విశాఖలోని బీజేపీ కార్యాలయంలో ఎంపీని కలిసిన నాయకులు స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఉక్కు కర్మాగారం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల్లో వేలాదిమందికి ఇప్పటివరకు న్యాయం జరగలేదని పేర్కొన్నారు. నిర్వాసితుల్లో ఒక్కొక్కరికీ 500 చదరపు గజాల స్థలం గాని, రూ.25 లక్షల నష్ట పరిహారం గాని అందజేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, కిలాని ముసలయ్య, కోసూరు తాతారావు, ఈశ్వరరావు, బొత్స దిలీప్ తదితరులున్నారు.

6 అడుగుల నాగజెర్రి పట్టివేత



నాగజెర్రిపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ సురేష్

పెదగంట్యాడ: నెల్లిముక్కులోని ఎంపీపీ పాఠశాల వద్ద 6 అడుగుల నాగజెర్రిని స్నేక్ సేవర్ సొసైటీ ప్రతినిధి శనివారం సాయంత్రం పట్టుకున్నారు. వివరాలివి.. పాఠశాలలోని బాత్రూంలోకి దూరిన నాగజెర్రి, తర్వాత బయటికి రావడంతో, అక్కడున్న విద్యార్థులు గమనించి, భయంతో గట్టిగా కేకలు వేశారు. అక్కడే ఉన్న ఎంఈవో రమణాజీ వెంటనే స్నేక్ సేవర్ సొసైటీకి సమాచారం ఇచ్చారు. వెంటనే సొసైటీ ప్రతినిధి సురేష్ అక్కడికి చేరుకుని, దానిని చాకచక్యంగా పట్టుకున్నారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎక్కడైనా పాము కనిపిస్తే దానికి ఎలాంటి ప్రమాదం తలపెట్టకుండా వెంటనే స్నేక్ సేవర్ సొసైటీకి 88663 68899 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. తాము వాటిని పట్టుకుని అటవీశాఖ అధికారుల సూచనల మేరకు అడవిలో సురక్షితంగా విడిచిపెడతామని తెలిపారు.

రాజీమార్గమే ఉత్తమం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

- 13వ అదనపు జిల్లా జడ్జి షణ్ముఖరావు
- లోక్ అదాలత్‌లో 178 కేసుల పరిష్కారం
- పరిష్కారమైన కేసుల విలువ రూ.5.42 కోట్లు

గాజువాక : కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవడానికి రాజీమార్గాన్ని అనుసరించడం ఎంతో ఉత్తమమని 13వ అదనపు జిల్లా జడ్జి షణ్ముఖరావు అన్నారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంతాలకు పోయి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయంతో పాటు ఆర్థికంగా కూడా చాలా ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు తలెత్తుతాయన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఈ ఇబ్బంది తగ్గుతుందని, కక్షిదారుల మధ్య మంచి సంబంధాలు ఉంటాయని అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడానికి వచ్చిన కక్షిదారులను ఈ సందర్భంగా అభినందించారు.

5 బెంచీల్లో 178 కేసుల పరిష్కారం

కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన లోక్ అదాలత్ శిబిరంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా న్యాయమూర్తులు 178 కేసులను పరిష్కరించారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్, యాక్సిడెంట్, బీమా తదితర రూ.5.42 కోట్ల విలువైన కేసులను పరిష్కరించినట్టు కోర్టువర్గాలు తెలిపాయి. ఈ శిబిరంలో న్యాయమూర్తులు ఐదు బెంచీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, పి.ప్రదీప్, కార్యవర్గ సభ్యులు బి.ప్రభాకరరావు, పి.పుల్లయ్య నాయుడు, ఏపీపీ వాణి తదితరులు పాల్గొన్నారు.

మై భారత్ పోర్టల్ ఎంతో ఉపయోగకరం



సదస్సుకు వచ్చిన అతిథులు

మల్కాపురం : యువతలో ఆచరణాత్మక నాయకత్వానికి,సాంకేతిక పరిజ్ఞానానికి మై భారత్ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి అన్నారు.మల్కాపురం సెయింట్ మహిళ కళాశాల వద్ద యువజన సదస్సు శనివారం జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆమె ఈ నెల 24వ తేదీన గీతం కళాశాలలో మై భారత్ పోర్టల్ పై సీనియర్ ప్రోగ్రాం అధికారి అనసూయదేవితో కలిసి ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యానన్నారు. శిక్షణలో తాము నేర్చుకున్న అంశాలు నేటి యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయన్నారు. యోగ, స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ మొదలగు విషయాలు మై భారత్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్టింపజేశారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు, అక్షింతలను అందజేశారు.

ఘనంగా సహస్ర నామార్చన

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి, 1001నామాలను పఠిస్తూ స్వామి వారికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం అందజేశారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో పాల్గొన్న ఉభయదాతలు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దంతేవాడ-కమ్లూర్ సెక్షన్‌లో పూర్తయిన పనులు

- సెక్షన్‌లో రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీలు
- పరీక్షలు, స్పీడ్ ట్రయల్ విజయవంతం



దంతేవాడ-కమ్లూర్ సెక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్ రైల్వే సేఫ్టీ సుహోమోయ్ మిత్ర



మోటార్ ట్రాలీపై పరీక్షలు చేస్తున్న సీఆర్ఎస్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కీలకంగా ఉన్న డబ్లింగ్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తయిన పనులను ఉన్నతాధికారులు వెంటవెంటనే తనిఖీలు కూడా చేస్తున్నారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన దంతేవాడ- కమ్లూర్ డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో శనివారం కమిషనర్ రైల్వే సేఫ్టీ(ఈస్ట్రన్ సర్కిల్) సుహోమోయ్ మిత్ర, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరీక్షించారు. అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో ఈ తనిఖీలు చేపట్టారు. దంతేవాడ-కమ్లూర్ స్టేషన్‌ల మధ్య మోటార్ ట్రాలీలపై ట్రాక్ అసెస్‌మెంట్స్, రైల్వే స్టేషన్స్, నూతన సిగ్నలింగ్ వ్యవస్థ, దంతేవాడ వద్ద డంకిని నదిపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జిలను పరిశీలించారు.

రవాణా మరింత వేగవంతం

స్పీడ్ ట్రయల్ కూడా విజయవంతంగా పూర్తయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. సవాళ్లు, ప్రతికూల పరిస్థితుల్లో ఈ రెండో లైన్‌ను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ డబ్లింగ్ లైన్ వల్ల చత్తీస్‌ఘడ్-ఆంధ్రప్రదేశ్ మధ్య రవాణా మరింత వేగవంతం కానుంది. పర్యటనలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(కన్‌స్ట్రక్షన్) ఎస్.శ్రీనివాస్, ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) డి.శ్రీనివాసరావు, ఇతర డివిజనల్ ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

50 లక్షల మొక్కలు నాటి పెంచండి



పూలు, ఔషధ మొక్కలతో విద్యార్థులు



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ విజయకుమార్

సీతమ్మధార: విశాఖలో 50 లక్షల మొక్కలు నాటి, వాటిని పెంచి, 5 వేల టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేద్దామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో శనివారం ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ విజయకుమార్‌కు గ్రీన్ క్లైమేట్ టీం ఔషధ మొక్కలు, పువ్వుల మొక్కలను అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామన్నారు. ప్రిన్సిపాల్ విజయకుమార్ మాట్లాడుతూ భూగోళం మీద సమస్త జీవరాశిని కాపాడాల్సిన బాధ్యత మానవాళిదేనన్నారు. ప్రకృతి ఆధారిత పంటల ఆహారాన్నే ఆరగించాలని సూచించారు. జీవీఎంసీ ఎస్ఆర్‌యూ ప్రతినిధి అక్షత మాట్లాడుతూ విశాఖలో అమలవుతున్న ఎకో వైజాగ్‌లో భాగంగా మొక్కలు నాటి, పెంచే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం స్కూల్ ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు.

పేద మహిళలకు అండగా కళంజియా

మల్కాపురం : మహిళలు శక్తివంతులు కావాలని, స్వయం ఉపాధి ద్వారా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ధాన్ ఫౌండేషన్ రీజినల్ కో ఆర్డినేటర్ కె.రామ్‌కుమార్ అన్నారు. మల్కాపురం కళంజియా సంస్థ ఆధ్వర్యంలో మల్కాపురం మరడిమాంబ కళ్యాణమండపం వద్ద కళంజియా సమాఖ్య సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక పరిధి 7 వార్డుల్లో సుమారు 440 పొదుపు సంఘాలు ఉన్నాయని, సుమారు 6 వేల మంది కుటుంబాలతో కళంజియా పనిచేస్తోందని వివరించారు. పొదుపు సంఘ సభ్యులు రూ.18 కోట్ల వరకు పొదుపు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు ఆదిలక్ష్మి, ఫెడరేషన్ కో ఆర్డినేటర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి జరిగే వైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ రవికాంత్ టీకిచెర్ల, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ఎం.మోనిషా, ఆప్తాల్మజిస్టులు పాల్గొంటారన్నారు. కంటి వైద్య పరీక్షలతోపాటు మధుమేహం, బీపీ, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని చెప్పారు. మురళీనగర్ పరిసర ప్రాంతవాసులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.